# స్వప్న

**"ప్లీజ్ స్వప్న.. నా మాట విను. ఒక్క సారి మనిద్దరం కలసి మాట్లాడు కొందాం. దయచేసి ఈ ఒక్కసారికి నా మాట విను" అభ్యర్థనగా అడిగాడు సుధాకర్.**

"సీ మిస్టర్ సుధాకర్, నీకిప్పటికే చాలాసార్లు చెప్పాను. ప్లీజ్.. డోంట్ వేస్ట్ మై టైం. నా జీవితంలో నీ అధ్యాయం ఎప్పుడో ముగిసిపోయింది. మంచో, చెడో అయిపోయింది. జరిగిపోయిన దానిగురించి పదే పదే ఆలోచిస్తూ జరుగుతున్న కాలాన్ని వృథాచేసుకోవడం అవివేకం."

"అంత కఠినంగా ఎలా మాట్లాడగలుగుతున్నావ్ స్వప్న."

"కొన్ని ఎదురుదెబ్బలు మనిషిని ఎంతైనా రాటుదేల్చగలవు సుధాకర్."

"ఇది మనిద్దరికీ సంబంధించిన విషయం స్వప్న."

"నో.. ఇది నా జీవితం. నాకు సంబంధించినంతవరకూ మనిద్దరం కలసి తీసుకోవాల్సిన నిర్ణయాలేవీ లేవు."

"నేనొప్పుకుంటాను, కానీ నీకు కూడా నా పరిస్థితి తెలుసు కదా స్వప్నా, కనీసం నువ్వైనా నన్ను అర్థం చేసుకోక పోతే ఎలా?"

"ఏం అర్థం చేసుకోమంటావ్ సుధాకర్? నాలుగేళ్లు నువ్వు నాతో సావాసం చేసినప్పుడు నీకు నీ కుటుంబ బాధ్యతలు గుర్తు రాలేదు. నాకు ప్రతీసారీ పెళ్లిపై ఆశలు, భ్రమలు కల్పించినపుడు నీకు నీ కర్తవ్యం గుర్తు లేదు. ఒక్కోసారి నీకు నా పట్ల కలిగే నిర్లిప్తత నాలో అలజడి రేపి, నేను నీకు దూరమవుదామని ప్రయత్నించినపుడల్లా నువ్వు నా దారికి అడ్డొచ్చి చేసిన బాసలన్నింటినీ గుడ్డిగా నమ్మాను. చివరికి ఒకపక్క మా ఇంట్లోవాళ్లు బలవంతంగా నా పెళ్లి చేస్తున్నారని నీకు చెప్పినప్పుడు, ప్రపంచాన్నైనా ఎదిరించి ఒక్కటవుదాం అని నువ్వు చెప్పడాన్ని అమాయకంగా నమ్మాను. నన్ను, నాకు ఇష్టం లేని పెళ్లి నుంచీ దూరంగా తీసుకెళ్తానని నువ్వు చెప్తే, నమ్మి నీకోసం అయినవాళ్లందరినీ కాదనుకొని వచ్చాను. కానీ నువ్వు నీవాళ్లకు నచ్చచెప్పుకోలేని అశక్తుడవయ్యావు.

ప్రేమించే వాళ్లు భయపడకూడదు, భయపడే వాళ్లు ప్రేమించకూడదు.

ఆనాడు నువ్వు, నిన్ను నమ్మి వచ్చిన ఓ ఆడపిల్ల పరిస్థితి ఎలా ఉంటుందని ఒక్కసారి ఆలోచించి ఉంటే పరిస్థితి ఇలా ఉండేది కాదు. ఏది ఏమైనా నేను నిన్ను ఇప్పుడు తప్పు పట్టదల్చుకోలేదు సుధాకర్. ఆనాడు నువ్వు నీకేది ముఖ్యమో అదే చేశావు. ఈనాడు నేను నాకేది ముఖ్యమో అదే చేస్తున్నాను."

"లేదు స్వప్న.. నీకు ఇంకా నామీద ప్రేమ ఉంది. దయచేసి నాకు నిన్ను కలిసే ఒక్క అవకాశం ఇవ్వు. ఇంకా నీకు నాపై కోపం ఉంటే నువ్వేసే ఏ శిక్షకైనా నేను సిద్ధంగా ఉంటాను."

"చూడు సుధాకర్.. నువ్వింకా ప్రేమ, పెళ్లి ఇలాంటి మాటలు మాట్లాడటం నాకు ఆశ్చర్యంగా ఉంది. వాటికి ఇప్పుడు నా దృష్టిలో ఎలాంటి విలువా లేదు. నీకు వాటి పట్ల ఇంకా ఏమైనా నమ్మకం ఉంటే ఓ మంచి అమ్మాయిని చూసి పెళ్లి చేసుకొని హాయిగా ఉండు."

"కానీ స్వప్నా నేను నిన్ను తప్ప మరో అమ్మాయిని..."

"స్టాప్ మిస్టర్ సుధాకర్, నువ్వనుకొంటున్నట్లు నేను అప్పటి స్వప్నని కాను. మన మధ్య రెండేళ్ల దూరం వచ్చేసింది. ఇది ఇక ఎప్పటికీ తగ్గని దూరం. ఈ రెండేళ్లలో మనిద్దరి జీవితాలలో చాలా మార్పులు చోటుచేసుకున్నాయి."



"కానీ నేను ఇంకా అప్పటి సుధాకర్‌నే స్వప్న. నేనేమీ మారలేదు."

"అందుకే తిరిగి నిన్ను నా జీవితంలోకి ఆహ్వానించడం లేదు సుధాకర్."

"స్వప్నా?"

"యస్, నాకు అప్పటి సుధాకర్ అఖ్ఖర్లేదు. నీకోసం నిన్నే నమ్ముకొని వచ్చిన నాకు ఓ రకంగా నమ్మకద్రోహమే చేశావు."

"కన్న తల్లిదండ్రులను ఓ కొడుకుగా చూసుకోవడం తప్పెలాగవుతుంది స్వప్నా?"

"కానీ నువ్వే సర్వస్వమనుకొని, నిన్నే చేసుకోవడం కోసం ఆరోజు నేను వస్తే అది నీకు వయసు తొందరలానో, నా మొండి పట్టుదలలానో కనిపించడాన్ని నేను ఎలా అర్థం చేసుకోవాలి?

ప్రతీ మనిషి సాధారణ పరిస్థితులలో మంచివాడిగానే, తెలివైన వాడిగానే కనిపిస్తాడు. కానీ కష్టం వచ్చినపుడో లేక క్లిష్టమైన సమస్య వచ్చినప్పుడే అతనిలోని అసలు మనిషి బయటకు వస్తాడు. ఏ స్త్రీ అయినా జీవితంలో కష్ట సమయం వచ్చినపుడు తనవాడు తనకు అండగా నిలబడాలనుకొంటుంది. ఆరోజు అలా నాకు నీ అవసరం ఉన్నరోజు, నాకు నీ అండ లభించలేదు. నీ జీవితానికి ఏది ముఖ్యమని నువ్వనుకొన్నావో, ఎవరికి నీ అవసరం ఉన్నదని నువ్వు భావించావో ఆరోజు నువ్వు వారి పక్షానే నిలిచావు. నీకు ఆనాటి మన ప్రేమ కన్నా మీ తల్లిదండ్రుల పట్ల గౌరవం, చెల్లెళ్ల పెళ్లి బాధ్యతలే ఎక్కువనుకొన్నావు. నిన్నే నమ్మి వచ్చిన నా పరిస్థితి గురించి ఒక్కసారైనా ఆలోచించావా?

జీవితంలో ప్రేమ ఒక భాగం మాత్రమే, అంతే కానీ ప్రేమే జీవితం కాదని తెలుసుకొన్నాను. మంచో, చెడో ప్రస్తుతం నా కాళ్లమీద నేను బతుకుతున్నాను. అంతేకాక నా తల్లిదండ్రులను కూడా పోషించే స్థాయికొచ్చాను. ప్రస్తుతానికి నాకు ఏ మగతోడు సాయం అఖ్ఖర్లేదు. కానీ భవిష్యత్తులో నా భావాలు నచ్చి, నా ఆలోచనలను అర్థం చేసుకొని నాకు తోడు, నీడగా ఉండగల వ్యక్తి తారసపడినప్పుడు నా జీవితాన్ని అతనితో పంచుకోవడానికి ప్రయత్నిస్తానే కానీ ఒకరికి బానిసగానో, లేక ఓ బాధ్యతగానో పెళ్లి అనే బంధానికి బందీ అవను.

కేవలం నీ భ్రమలను తొలగించడానికే ఇంతసేపూ ఫోన్‌లో అయినా మాట్లాడుతున్నానుగానీ తిరిగి నిన్ను కలవడానికి కాదు. ఏ అమ్మాయి అయినా తన భర్త జగదేకవీరుడు కాకపోయినా, ప్రపంచంలోకెల్లా ధనికుడు కాకపోయినా బాధపడదు కానీ, తనని ప్రేమగా చూసుకోలేకపోతే మాత్రం సంతోషించదు. తన భర్తకి ఎన్ని వ్యసనాలున్నా భరిస్తుంది. ఎందుకంటే ఆ వ్యసనాలకు దూరంగా ఉన్నప్పుడైనా తనకి దగ్గరవుతాడని. కానీ ఏ అమ్మాయి అవసరం వచ్చినప్పుడు అండగా ఉండని వ్యక్తికి మాత్రం తల వంచి తాళి కట్టించుకోదు. నీలో ఇంకా కాస్తయినా సంస్కారం, అభిమానం ఉన్నాయనుకొంటున్నాను. అందుకే నీకు మాటలతోనే చెప్తున్నాను. అర్థం చేసుకోగలవనుకొంటున్నాను. ఇంకెప్పుడూ నాకు ఫోన్ చెయ్యాలనిగానీ, కలవాలనిగానీ ప్రయత్నించకు. గుడ్ బై.." కసీమంటూ రిసీవర్ పెట్టేసింది స్వప్న.

"ప్రతీ ఆడపిల్ల నీలాగే ఆలోచించగలిగితే ఈ ప్రపంచంలో ఎక్కడా ప్రేమించి మోసపోవడాలు, ప్రేమ పేరుతో ఆత్మహత్యలు, జీవితాలు నాశనం చేసుకోవడాలు ఏవీ ఉండవు స్వప్న" అంటూ రూంలోకి వస్తోన్న సుమతి వైపు నిర్లిప్తంగా ఓ చూపు చూసి, సీటులో వెనక్కి వాలి కళ్లు మూసుకొంది స్వప్న.

**-యల్లాప్రగడ సువర్చలాదేవి**